# ప్రేమ ప్రవాహం

భానూ తల్లికి కూతురంటే చాలా ప్రేమ అది ప్రవాహం లాగా ప్రవహిస్తూనే వుంటుంది.

“కన్నతల్లీ! చిట్టీ! అమ్మడూ! అమ్మా! బుల్లెమ్మా! నన్ను గన్నతల్లీ!” అని అనేక ముద్దుపేర్లతో పిలుస్తూ క్షణం కూచో నివ్వకుండా పని చెపుతుంది. తల దువ్వుకో నివ్వదు. గది తలుపు గడియపెట్టి స్నానం కానివ్వాల్సిందే. హోమ్‌వర్క్ అర్ధరాత్రి చేసుకోవాలి. దీపం తగ్గించి చదువుకోవాలి. పైకి విన బడితే “దీపం ఆర్పి పడుకో, చదువుచాల్లే.” అంటుంది.

“పక్కింటి కెళ్లి కొబ్బరి చిప్పపట్రా. వాళ్ళు రోజూ దేవుడికి కొబ్బరికాయ కొడతారు- చిప్పవుంచుతారు. యెదు రింటి వాళ్ళు కరివేపాకు కోసివుంచుతారు. పట్రా ఆ కోమటి కొట్టు కెళ్లి బొంబాయి రవ్వ వో కేజీ పట్రా డబ్బిదుగో. అన్నయ్య షర్టు, మీనాన్న ధోవతి, నా పట్టుచీరా, యిస్త్రీ చేశావా? ఆ సైకిలేసుకెళ్ళి నర్సింగ్‌హోమ్‌లో వున్న అక్కయ్యకి కాఫీ ఫ్లాస్కు యిచ్చిరా. దోవలో రొట్టె, పళ్లు కొని తీసుకెళ్లు, మరిచేవు. అల్మారాలో పర్సు తీసు కెళ్లు.

అన్నిపనులూ చేశాక, అదరాబాదరా అన్నం తినిపించి “ఇహ బడికిపో”. అంటుంది తల్లి,

తల్లిప్రేమ ప్రవాహం యీది గట్టునబడి, బడికిచేరుతుంది భానూ.

బడిలో క్లాస్‌టీచరుకి గూడా భానూ అంటే ప్రేమే. ఆమె పేరే ప్రేమక్క. పిల్లలులేరు. భర్తకి ఆస్థ్మా.

''భానూ! నిలబడి పాఠం చదువు.'' అంటూనే అటెండెన్సు మొదలెడుతుంది. భాను తనసీటు ముందు నిలబడి, పుస్తకం తెరుస్తుంది. "ఇన్‌స్పెక్షన్ వస్తున్నది. తక్కినపిల్లలకి అలా చక్కగా చదవటం నేర్పు. బడివదిలాక పిల్లల్ని పోగుచేసి జాతీయ గీతం నేర్పు."

అంతటితో శిష్యురాల్ని వదలదు, ఇంటికెళ్తూ వెంటబెట్టు కెళ్తుంది. వంటసాయం, స్టోర్సునించి కిరాణా తేవటం, మెడికల్‌హాల్ నించి మెడిసిన్స్ తేవటం చేయిస్తుంది. "నీ మార్కుల సంగతి నేచూస్తాలే. నువ్వాటే చదవక్కర్లేదు. క్లాసులో పాఠం వింటుంటేనే వచ్చేస్తుంది. నీకు టెక్ట్సు తెచ్చాను. నోట్‌బుక్కు కిందటేడువి వున్నాయి. టెక్ట్సు చింపకు సెంటెన్సెస్ కింద అండర్‌లైన్ చేయకు. నువ్వీ తరగతి పాసుకాంగానే నేనువాటిని సగం ధరకు అమ్మేస్తా.'' బుజంతట్టి నవ్వి తన పెన్ను యిస్తుంది.

"పారేయకు. రేపుక్లాసులో యిచ్చేయి.'' అంటుంది. భానూ కొత్త పెన్ను చూసి సంతోషిస్తుంది. దాన్ని అస్తమానం దులపక్కర్లేదు. నోట్సు సాపుతీసుకోటమే. లెక్కలు స్టెప్ బై స్టెప్ చేసుకు పోవటమే.

వసంతం వచ్చింది. భానూ వొళ్లంతా మొగ్గ దొడిగింది. లావుపాటి రెండుజడలు వేసుకుంటున్నది. ఒకజడ మొదట్లో

మెర్రిగులాబీ పెడుతుంది. ఫాన్సీ రింగులూ, గాజులూ, తిలకం, యూనిఫామ్ వేసుకుని, కాలేజీలోకి వెళ్లింది. నవ్వితే బుగ్గలు సొట్టలుపడేవి ముత్యాల పలువరుస. ప్రిన్సిపాల్ శారదాదాయి, బానూ నెమ్మదీ అణకువ చూసి ప్రేమించకుండా వుండలేకపోయిలది. చిన్న చిన్న పనులుకాక, అఫిషల్ వర్క్, మార్కులు కూడి పర్సెంటేజ్ కట్టడం, లిస్టు తయారు చేయుటం గూడా నేర్పింది. మధ్య మధ్య తిడుతూ వుండేది భానూకి యాక్సిడెంట్సుగూడా యెదురయేవి. ప్రిన్సిపాల్ భాగ్యశాలి. మారుతీకారూ, ఆటో, స్కూటరూ, మోటర్‌సైకిల్, లూనా వున్నాయి. మోటర్‌సైకిల్ పెద్దది. బరువు. కారేమో ప్రిన్సిపాల్ డ్రైవ్ చేసుకుంటుంది. తక్కిన వాహనాలు భర్తకీ పిల్లలకీనూ భానూకి. ప్రిన్సిపార్ కొడుకు లూనా నడపటం నేర్పాడు. అనిల్‌బాబుకి డ్రైవింగ్, మెకానిజం వచ్చు, బి.యె. డేకుతున్నాడు. వర్క్‌షాపులో వర్కర్స్ అతని ఫ్రెండ్సు. కారు సర్వీసింగ్‌కి యిచ్చి వచ్చాడు. స్కూటర్‌మీద తల్లిగార్ని కాలేజీవద్ద దింపేశాడు. వస్తుండగా భానూ కనిపించింది. యెక్కించుకుని శరవేగంతో వెళ్తున్నాడు.' నో ఎంట్రీ, యిటుగా వెళ్లిరాదు అనేవి గమనించడు. మలుపులో ఆటోతో ఢీకొన్నాడు. అనిల్ స్టంట్‌మాన్‌లాగా దూకేశాడు గానీ, భానూ రెండుచేతులూ ఫ్రాక్చరయినాయి.

ప్రిన్సిపాల్, కొడుకును వేడుకగా తిట్టింది. భానూని మూడు వారాలు తనింట్లోనే వుంచుకున్నది. భానూ పోమరి కాదుగదా. బాండెజ్ తొలగించగానే పంపింది.

శారదాబాయి చూతురు అమాష భానూ యీడుదే తన రఫ్‌నోట్సు ఫెయిర్‌తీయమని భానుముందు పెట్టింది "మేటనీ కెళ్దాం రా'' అని మూడున రకి లేవ దీసింది. అయిదున్నరకే మేటనీవదిలారు. మోటర్‌సైకిల్ మీద కొంప కొస్తున్నా రిద్దరూ. గాలికి జుట్టుయెగురుతుంటే యెంతో బావుంది భానూ. పార్కువేపుగా వెళ్లాలని మలుపు తిప్పింది అనూష సైకిల్ ఫుట్‌పాత్ యెక్కి యినపఫెన్సుకితాకి, యిద్దర్నీ ఫెన్సు మీదుగా పార్కులో. లాన్సుమీదికి విసిరేసింది. తానుపడిపోయింది. లాన్సుగదా దెబ్బలు తగల్లేదు. నవ్వుకుంటూలేచారు. గేటు తీసుకు నివచ్చారు. సైకిల్ని లేవనెత్తారు. అదిస్టార్టు కాలేదు. తోసుకుంటూ నడిపించు కెళ్లి వర్క్‌షాపులో ఎడ్మిట్ చేసి చేతులు దులుపుకుంటూ వచ్చారింటికి.

అంతావిని ప్రిన్సిపాల్ శారదాబాయి. గుడ్లెర్రజేసింది "బేబీ అంత హెవీవెహికిల్ డ్రైవ్ చేయలేదు. నువ్వెందు కెక్కావు వెనకా? స్టుపిడ్! వుండు. మీ అమ్మ తోచెప్పి నీ పెళ్లిచేయిస్తా, నువ్వు బి.యె. పూర్తి చేయలేవు. నీకు యెమ్మే చదివే గీతలేదు." వురిమింది. భానూ అమాయికంగా చూస్తూ అన్నది.

'ధరలు చుక్కలందుకుంటుంటే, యింటిఖర్చు పెరిగి పోతుంటె, నీబొందమీద కట్నం గూడా యెక్కడ నించి తెచ్చి బోర్లించనే భానూ. యెవడితో నన్నా లేచిపో. నీ వేషాలూ తిరుగుళ్లూ మవ్వు. లేదా వుద్యోగం లో యేడు' అంటుందండీ మాఅమ్మ. కట్నంలేకుండా యెవడన్నా పెళ్లాడుతాడా? తనతో లేచి రమ్మంటాడుగానీ'' అంటూ దీర్ఘం దీపింది.

కాలానిక్కడా మనుషులంటే ప్రేమేలేకపోతే కాన్నాళ్లెం దుకు బతకనిస్తుందీ? అలాకాల ప్రవాహంలో యీదుతూ, భానూ ఇరవై ఒకటవ వసంతంచూసింది. యెమ్మే ప్రైవేట్‌గా వెళ్ల చ్చని తెలిసింది. నాగపూర్‌యూనివర్సిటీ వారు సెంటర్ నడుపు తారు. కాని ఒక్కవసంతము వడగాడ్పుకొట్టకుండా గడవలేదు.

ఒక ప్రైవేట్ కంపెనీవారు యింటర్వ్యూజరిపి చిన్న వుద్యోగం శాంక్షన్ చేశారు ఒడ్డెక్కినట్టు ఫీలయింది. భానూ యెమ్మేవద్దనుకున్నది. హెవీవర్క్ చేస్తున్నది. రెగ్యులర్‌గా వస్తున్నది హానెస్ట్ అనే పాయింట్స్ గమనించి ప్రమోష నిచ్చారు. జీతంహెచ్చించారు వీళ్లలో లేను అనుకున్నది.

అదే కంపెనీలో పనిచేస్తున్న శరశ్చంద్రుని చూశాక అత నిచ్చే గౌరవం తెలిశాక, స్నేహశీలి అనుకున్నది. భానూ చిగి ర్చిన చెట్లనుచూసింది. "వసంతం వచ్చిందే" అనుకున్నది, కోకిల అరుపులు వినిపించినై. చిలకగుంపులు చూసింది. శరశ్చంద్రకూడ నడుస్తూ తీయగా మాట్లాడుతుంటే, నిర్మల మైన నీటిపై నావలో కూచుని తెడ్డువేస్తున్నట్టు లోచింది భానూకి పైన వెన్నెలా చంద్రుడూ, నీళ్లపై తళతళలాడే చంద్ర కిరణాలూ, వొడ్డునిండి పూలగుబాళింపూ వూహించింది. అయేడు మామిడి పళ్లు తీయగా తోచినై. మల్లెలు వాసనలతో మతు యెక్కించాయి.

శరశ్చంద్ర మేకానికల్ ఇంజనీర్, పాసైనాను అనుకుం టుండగానే జాబ్ వచ్చింది. స్వేచ్ఛ లభించింది" అనుకు న్నాడు. 'దేహీ' అంటూ తల్లినో తండ్రినో "యాచించే బాధ

వదిలిపోయింది," అనుకున్నాడు. కాని తల్లీ దండ్రీ పెళ్లి అనే మిషతో కొడుకు భరతం పట్టారు.

"పెళ్లాం రాగానే మళ్ళా స్వేచ్ఛకు తిలోదకాలివ్వాల్సిందే ఆ రిచ్ భార్యారత్నానికి బాడీగార్డుగా సెక్యూరిటీ యివ్వటమే గాక జీతమంతా ఖర్చుచేయాలి, స్వంతానికి వదలదు. మరి, కట్నం కానుక, లాంఛనాలూ. గౌరవం మర్యాదలూ తెచ్చి యిస్తుంది గదూ భార్యాలలామ! పోనీ అంటే అదనపు ఖర్చులు చూపిస్తుంది. పిల్లల్ని కంటుంది. వాళ్ల జబ్బులూ చదువులూ చాలా అంటే చాలవు. పెళ్లిచేయాలని సంబంధాలు వెతకమం టుంది. ఆరొటీన్ విసుగెత్తుతుంది. పునరపి జననం పునరపి మరణం, పునరపి జఠరే శయనం, మాచెడ్డరోత. పిల్లలకు పిల్లలు న్యూసెన్సు. శరశ్చంద్రకు విదేశాలు చూచిరావాలని వున్నది. కంపెనీవారే పంపిస్తారు. పెళ్లి బెడద బెందడు లాగా పట్టు కున్నది. నేర్పుగా వంకలు పెడుతూ తప్పించుకుటున్నాడు అతను పెట్టిన వంకలు .

"పెళ్లి కూతురు మరీ చిన్నగా వున్నది." అని వోసారి, "మరీ లావై తల్లిలాగా వున్నది. ఒక డెలివరీకాగానే యింకా లావౌతుంది. ఇంక తగ్గదు." అనిమరొకసారి.

అతను చెప్పే అభ్యంతరాలు వాళ్లూ అంగీంరించారు. తల్లి దండ్రులే మంచివాళ్ళులాగా తోచారు శరశ్చంద్రకి ఇస్తే తీసు కుంటారు. ఇవ్వకపోతే 'జీతమంతా యేంచేస్తున్నావు' అనరు, తల్లిమంచి భోజనం పెడుతుంది. తండ్రి పాలిటిక్సు మాట్లాడు తాడు. టెన్నిస్ ఆడతాడు, అయ్యో! ఆభార్యా తిలకం వచ్చిం

దటే క్రీతదాసుడిని చేస్తుంది. జీవితమనే బందిలాగమంటుంది. తాను కూమంటుంది.

ఇలాంటి భావాలతో పెళ్ళి తప్పించుకుంటూ, ఛాతీవిరుచుకుంటూ తిరుగు తుండగా ఖానూ రోజూ కంటబడేది. నవ్వుతూ పలకరించే వాడు. తను పనిచేసే కంపెనీలోనే, యింత ఆరోగ్యము నిదానమూ వున్న అమ్మాయి వున్నా, గమనించక టైమ్ వేస్టు చేసుకున్నానే అని చింతించాడు. ఆఫీస్ ప్యూన్ని గూడా గౌరవంగా చూస్తుంది.

బ్రహ్మ చర్యం బాధించ సాగింది. తల్లియేమో మళ్లా పెళ్ళిచూపులకి వెళ్ళాలి అంటున్నది. ఆ తంతే ఫార్మల్‌గా వుంటుంది. తన పాత్రకు ప్రాముఖ్యత వుండదు. ఆనాటకంలో తన తండ్రి హీరో, అలాగాదు తాను హీరోకావాలి ఒక్క వెలుగు వెలగాలి.

తన తమ్ముడు తల్లిదండ్రులను మెప్పించాలని వారు సెలెక్టు చేసిన పిల్లకు తాళి కట్టాడు. అంతే భార్యాదాసుడు అని పేరు తెచ్చుకున్నాడు. చీదుతూ, యేడుస్తూ కనిపిస్తాడు. తలొంచుకు జవాబిస్తాడు

"అదేమిట్రా శశీ! మగబిడ్డవు గాదా? ఆడపిల్లలాగా తలొంచుకుని జవాబిస్తావేం? అని నిలేస్తే, "నీకు తెలియ దన్నాయ్! నువ్వింకా బ్రీమాన్‌వి, నేనిరకాటంలో వడ్డాను, అడకత్తెరలో వక్కలాగా వున్నది నాపని, భార్యా యేమో సుకుమారీ. ఆమె ఘోషవినాలి. అత్తవారే మోమిలియనీర్స్, మిలియన్సున్నాయి గాని కల్చల్ లేదు. వాళ్ళుమాట్టాడుతుంటే డబ్బాగీకుతున్నట్టు

వుంటుంది. అప్పుడే యిద్దరు కుర్రకుంకలూ ఇంటికి వెళ్ళగానే, "నాన్నా" అంటూ, కాళ్ళకు చుట్టు కుంటారు సూటుకి మరక లౌతై. నలిగిపోతుందటే, కర్కశంగా యేడుస్తారు యెత్తుకోమని నస్తా." "అంటూ, కర్చీఫ్‌తో కళ్ళు అద్దుకుంటూ, జలుబువల్ల తలభారంగా వుంటే తలనొక్కుకుంటూ వెళ్ళిపోయాడు,

ఖానూ నవ్వు మొహం కనబడని రోజున, లాకప్‌లో పోలీసులు టార్చర్ చేస్తున్నట్టు బాధపడతాడు శరశ్చంద్ర స్వభావాన్ని బట్టి చూస్తే ఖానూ మెత్తని మనిషి,

"డొసైల్ అండ్, డొమెస్టిక్ క్రీచర్," అనుకున్నాడు. దయగల అమ్మాయి. అప్పులిస్తూ వుంటుంది. తీర్చినప్పుడే తీసుకుంటుంది,

కూడా నడుస్తూ బాతాఖాఖానీ వేశాడు. ఖానూ కొద్దిగా అర్థ డొక్కులాగా తెలివి తక్కువదానిలాగా కనబడింది. తనతో ఘట్టిగా వాదించింది, పెళ్లి తంతు జరగని దీ, మగాడితో పోరాడు అని సిద్ధాంతీకరించిం అటువంటి అయిడియా మంచిదిగాదు, మార్చేయాలని ఆలోచించాడు, ఆనాడు ఫస్ట్, జీతాలందు తాయి, కూడానడుస్తూ సవ్వుతూ అప్పు అడిగాడు,

ఖానూ అందంగా నవ్వింది. ఓరచూపు చూసింది. శరశ్చంద్ర ఒళ్ళు జలదరించింది. గుండెదడదడమన్నది. పైకి వినబడుతున్నదేమోనని గుండెమీద చేయి వేసుకున్నాడు,

"టెస్టు చేస్తున్నారా? టీజ్ చేస్తున్నారా? మీజీతం పెద్దదేగా' "అన్నది. పమిట కప్పుకున్నది.

"నేను బాంక్‌కి వెళ్ళి డ్రాచేసి తెచ్చుకోవాలి. జీతం అకౌంట్‌లో చేరుతుంది. నామోటర్ సైకిల్ రిపేర్లో వున్నది, సిటీబస్‌లో వెళ్ళాలి. అందులో యీ వేళప్పుడు గుమ్మిగుం టుంది. బస్ కుదుపుకి, వుద్యోగినులు ముందుకీ వెనక్కీ వూగుతూ వుంటారు. సడెన్ బ్రేక్ పడిందంటే మీద పడతారు నాకు భయం" అని అభినయించాడు.

"నేను తోడువస్తా పదండి. ఇవ్వనని గాదు అంటున్నది. ట్రిక్స్ చేస్తున్నారా అంటున్నాను, నవ్వుతూనే హాండ్‌బాగ్ విడ దీసి, అయిదువందల రూపాయల నోట్లు అందించింది.

"మరి తోడురారూ?" నోట్లు అందుకుని, కళ్ళకద్దుకుని జేబులో పెట్టుకున్నాడు.

మళ్ళీ నవ్వింది భానూ.

అది మొదలు అప్పు చెయ్యటమూ, తీర్చనూ సాగించాడు. "వడ్డీ యిస్తా" అని రెస్టారెంట్సుకూ, మాటనీలకూ తీసికెళ్ళాడు. కంపెనీ యజమాని విదేశం వెళ్తుంటే సెండాఫ్ యివ్వటానికి యెయిర్ పోర్టుకి కారులో తీసికెళ్ళాడు. తిరిగి వచ్చేటప్పుడు ఆ కారుని ఖరీదైన హోటల్ ప్రాంతికి పట్టించాడు. మైమర పించాడు. ప్రేమ ప్రవాహంలో కొట్టుకుపోయింది భానూ.

కంపెనీవారు శరశ్చంద్రని యూరప్ పర్యటనకి పంపారు ఆరువారాలు. వ్యాపారాన్ని మోడరన్ పద్ధతుల మీద రన్ చేయటం, ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్‌ను గురించీ తెలుసుకు రమ్మ న్నారు. అన్ని నెరవేర్చుకొచ్చి మెప్పు పొందాడు కానీ

ఆఫీసులో ఆమె కుర్చీలో భానూ కనబడలేదు. ఆఫీసు మూశాక ఎంక్వయిరీ చేస్తే యీ వేళలో గుళ్ళ దర్శనమిస్తుందని తెలిసి,

"అదేం చెప్పటం? యే గుడీ? భక్తురాలైందా?" అని కసిరాడు.

"మన వూళ్ళో కనీసం ఆరు దేవాలయాలైనా పెద్దవి వున్నాయి. బీచీ వున్నది" అని నవ్వి వెళ్ళిపోయారు చెప్పిన వాళ్ళు.

మోటార్ సైకిల్ మీద తిరగ్గా తిరగ్గా అందింది. జబ్బ పట్టుకుని సీటు వెనకాల బెర్తుమీద కూచోబెట్టి, నిమిషంలో స్టార్ట్ చేశాడు. యెనిమిదిన్నర అయింది. మంచి రెస్టారెంటుకి తీసి కెళ్ళి ఆర్డరిచ్చాడు. డిమ్‌లైట్స్, ఫిల్మ్ మ్యూజిక్ కారంగా లేకుండా భోజనం బావుంది. స్వీట్ పులావ్, మరీ ఘాటుగా లేని కుర్మా, గులాబ్‌జామ్ ఆవురావుర్న తింటున్నాడు.

తలెత్తి చూస్తే భానూ వో యింగ్లీష్ మాసపత్రిక చూస్తున్నది. అన్నం పళ్ళెం అట్లాగే వున్నది. తీపి అన్నా తిన లేదు.

"భానూ! అలా వున్నావేం? భోజనం కానీయవూ? ఒంట్లో బాగా లేదా? యేమున్నదా పత్రికలో?"

భానూ జవాబివ్వలేదు. మౌనంగా బొమ్మ చూస్తూ వుండి పోయింది. శరశ్చంద్ర భానూ మీదికి వంగి, ఆ బొమ్మ చూశాడు. ఒక పసిబిడ్డ కాళ్ళూ చేతులూ ఆడిస్తూ నవ్వు

తున్నాడు. తల్లి తన బిడ్డని ప్రేమగా చూస్తున్నది. యే పాలు వాడాలీ ఎడ్వర్టైజ్‌మెంట్.

శరశ్చంద్రకి అర్థమయింది. భానూ తలెత్తి చూసింది.

“నీ జాగర్తలో నువ్వున్నావనుకున్నాను” అన్నాడు. పిచ్చి మొహం పెట్టి రాని నవ్వు నవ్వాడు.

“ఉన్నాననుకోండి. కాని పరీక్ష ఫెయిలయినట్టు ఫెయిలయినాను. ఇంత త్వరగా కడుపు పండుతుందనుకోలేదు. యేదీ మీతో ఆనందాబ్ధిలో ఓలలాడి మూడు నెలలేగా అయిందీ! మా యెదురింటి శ్యామల నా యీడుదే. అయిదేళ్ళ నించీ కడుపు పంట పండుతుందేమోనని చూసి, విసుగెత్తి నోములూ, వ్రతాలూ, గోపూజా చేసింది. డాక్టరమ్మనీ కన్‌సల్ట్ చేసింది. పసిపాప నవ్వులు చూడాలని తపించిపోయింది. ప్రస్తుతం అశ్వత్థ వృక్షానికి ప్రదక్షిణలు చేస్తున్నది. నేను తపించిపోలేదే.”

“పరిష్కరిద్దాం” అన్నాడు తెప్పరిల్లి.

మరో నెల గడిచింది. శరశ్చంద్ర తన కర్తవ్యాన్ని తలాయిస్తున్నాడని భానూ అనుకున్నది. మొహం తప్పించేసింది. మనిషి అందకుండా పోయింది.

భానూ చకచకా వెళ్ళి, బస్సందుకుని స్త్రీల మధ్యకి దూరిపోతే, బస్ స్టార్ట్ అయ్యేది. రన్నవుతున్న మోటర్ సైకిల్ మీద వున్న శరశ్చంద్ర, ఒక పాదం కింద ఆనించి, వెలవెల పోతూ బస్‌లోకి చూశాడు.

పమిటకొంగు చివరలు గూడా కనపడకుండా ఆటోలో కూచుని "పోనీ" అనగానే ఆటో వెళ్తుంటే నిలబడి చూశాడా ప్రేమికుడు.

"ఒక్క నెలలో యింత మార్పా! అంత అసహ్యం పుడుతుందా? ఇది ప్రేమా సుడిగుండమా?" అని విస్తుపోయాడా తండ్రి గాబోతున్న వుద్యోగి. పురుషుడు గదూ. పౌరుషం పొంగింది. కాపు వేశాడు. పని యెక్కువగా వుండి, చీకటిబడి యింటిదారి బట్టింది భానూ బస్‌స్టాప్ చేరింది. బస్ వచ్చేసింది. జనం దిగారు యెక్కుతున్నారు. చివర వున్నది. హేండిల్ పట్టుకున్నది. వెనక నిలబడి హేండిల్ మీది చేయి వదులు చేశాడు. బలంగా జబ్బ పట్టుకుని తీసికెళ్ళి ఆటోలో కూచో బెట్టాడు.

"పార్క్‌కి పోనీ" అన్నాడు.

రాగానే రెక్క పట్టుకుని దింపి, ఆటోవాలాకి డబ్బిచ్చేశాడు. భానూని పార్క్‌లో బెంచిమీద కూచోబెట్టి యెదురుగా నిలబడ్డాడు.

"మొహమెత్తి నా మొహం చూస్తూ చెప్పు భానూ. నన్ను కలుసుకోవద్దు అను".

భానూ మొహం మీదికి అలలులాగా, నవ్వూ, జాలీ, యేడుపూ, ప్రేమా వచ్చిపై. శరశ్చంద్ర వేడి వూపిరి మొహానికి తాకుతున్నది. భుజం మీద చేయివేశాడు. మృదువుగా చేయి తీసేసింది.

"మీరెప్పుడూ మీ ఆశయాలు నెరవేర్చుకోవాలని చూసుకుంటారు. నాక్కూడా ఆశయాలున్నాయనుకోరు. నాకు యెబార్షన్ యిష్టం లేదు. నేను రిజైన్ చేసి మరో వూరికి వెళ్ళదలుచుకున్నాను" అన్నది. కళ్ళు తడి అయినై.

శరశ్చంద్ర మొహం పాలిపోయింది.

"రెజిగ్నేషన్ యిచ్చేశావా?" అన్నాడు గంపెడాశ్చర్యంతో. పక్కన కూచుని అన్నాడు. "భానూ! సంఘంలో గౌరవం కోసమే గదా ఆరాటపడుతున్నావు. నేను చెప్పేది సరిగా అర్థం చేసుకుంటే నువ్వడిగేది నే చేస్తాను."

"యేదీ యీ కాగితం మీద వ్రాయండి" అన్నది. హాండ్ బాగ్ విప్పి, పెన్నూ నోట్ బుక్ తీసి, అట్టతీసి, పెన్ మూత తీసి అతనికిచ్చింది.

అతను అందంగా వ్రాసి అందించాడు.

అతను వ్రాసిన లైన్లు చదివింది భానూ. కళ్ళు తుడుచుకున్నది. తల్లి కాబోతున్న భానూ అతనివంక తల్లిలాగా చూసింది. వాగ్దానం చేస్తున్నట్టు భుజంమీద చెయ్యివేసింది.

"మీ ఫ్రీడమ్‌కి అడ్డురాను. మీడబ్బు లాగాలని చూడను అంతగా మనసు విరిగిపోతే, డైవోర్సు యిస్తాగాని, పిల్లల్ని అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేయాలని చూడను. దాసునిగా మార్చను. మరి డైవోర్సు తీసుకోవటానికన్నా సివిల్ మారేజి చేసుకోవాలి. నేను గూడా వ్రాసి యివ్వనా నా మాట చాలా?" అన్నది.

శరశ్చంద్ర మొహంలోకి రక్తంచేరి రంగు వచ్చింది. ప్రేమ ప్రవాహంలో ఓలలాడాడు.

"హమ్మయ్య! భానూ! నేను నీకు సరిగా అర్థంగాలేదు. పోదాం రా. ఇల్లు చూస్తా. రాజీనామా చింపేయి."

## 2

భానూ శరశ్చంద్ర వేరే వుంటున్నారు, వారికిద్దరికీ అయినవారు లబలబలాడి వినోదం కల్పించారు.

"మేము అడ్డుపడ్డామా? చెప్పకుండా, చెందకుండా ఇదేం "పెళ్లి? అన్నారు.

కొంతమంది బంధువులు నోళ్లు నొక్కుకున్నారు.

"పెళ్లి నాటికే ఏడో నెలట! వాడాడుకున్నాడేమో!" వవ్వారు. వారి ఆత్మీయుల మధ్య నిప్పు రగుల్చాలని చూశారు

"భానూదే పెద్ద జీతం. కన్నవారి నుండి విడదీశాడు."

'శరశ్చంద్రుడొక్కడే, తల్లిదండ్రిలనంటి పెట్టుకుని, ఖర్చులు భరిస్తున్నాడు. తక్కిన పిల్లలు డబ్బుతో అవసరమున్నపుడే వచ్చి, డబ్బుగుంజుకుపోతారు. కొడుకు దూరమైనట్టే కోడల్ని రానివ్వరు. వాళ్లు వెళ్ళరు." అని భవిష్యత్ సూచించారు.

కానీ భానూ, శరశ్చంద్ర యెవరికీ దూరంగా లేదు. యెవరూ వారిని త్యజించలేదు.

మనిషి సహాయం అందక వచ్చే డబ్బు సరిపెట్టుకుంటూ, సహనానికే రాపిడి వచ్చి వన్నె కెక్కారిద్దరు.

వారి అవసరానికివచ్చే భానూ బంధువులూ, శరశ్చంద్ర బంధువులూ గౌరవ మర్యాదలు పొందారు.

కాలం నదిలా ప్రవహిస్తూ వెళ్ళింది. పర్వదినాలలో ప్రేమప్రవాహంలో మునకలేసారు. యిరువాగులవారూ.

"అమ్మో! వదినగారూ! చిక్కి శల్యమైనారండీ, కోడలు కడుపునిండా అన్నం పెట్టదా యేం?"అని పరసాలాడుకున్నారు బావగారూ! మరీ నల్లపూసై నారే! వలంటరీ రిటైర్‌మెంటు యిచ్చారని తెలిసింది పూరాణ పఠనం, గీతా పుపన్యాసాలుం టాయి మీరు రెగ్యులర్‌గా లైబ్రరీకి రండి" అని మంచీశబ్బరా అడగసాగారు మునుపు యీ యింటిమీది కాకి ఆ యింటిమీద వాలదు. ఇపుడు మనుషులే రాక పోకలు సాగించుచున్నారు.

"ఇంటి దగ్గర నన్నెవరూ లెక్కచేయరు భానుమతీ! ఈ కాలం పిల్లలకి మర్యాదలు తెలియవు" అని భానూ వంట చేయ లేదని చేసి పెడుతుంది.

భానూ పోడలు బండ్లు గావడం, బండ్లు వోడలు గావటం చూసింది. శరశ్చంద్ర ఛీఫ్ అయినాడు. పిల్లలు యూనివర్సి టీలో చదువుతున్నారు. తనకు ప్రమోషన్ వచ్చింది. ఒకనాడు మనిషి సహాయం అందక, ధన సహాయం అందక పూటీలాగా తోచింది లైఫ్. ఇవాళ ఆ రెండు కావల్సినవాళ్లు ప్రేమ వాకిట

జోస్తారు. పూసుకు తిరుగుతారు, కాని తానింకా వూబిలోకి దిగదు, గట్టెక్కిందెలాగయితేనేం ప్రవాహంలో కొట్టుకు వచ్చే, చెత్తా చెదారం ప్రవాహంలో యేర్పడే సుడి గుండాలు చూస్తూ వుంటుంది.

అత్తగారు వచ్చి, తీయని గొంతుతో ప్రేమగా అంటుంది "అమ్మాయీ! భానుమతీ, మాదేమున్నది. పెద్దవాళ్ళమయి పోయినాం మా తరం అయిపోయింది. వూరు పొమ్మంటే కాడు రమ్మంటున్నది. మీయింట్లో మీరుండాలి." ఇల్లుఅంటే ఒకనాడు తాను నిరంకుశంగా యేలిన సామ్రాజ్యం. అది ఇప్పుడు శిధి లావస్థలో ఉన్నది, మనీ డిమాండు చేస్తున్నది.

మామగారింకో ఆకు యెక్కువ చదివారు. 'పిల్లలు యెదురు తిరగకుండా చూడగలిగేది పెద్దవాళ్లే నేను మంచి సం బంధాలు చూసి పెట్టాను. వీళ్లు నాకు మాలిమి అయ్యారు. 'తాతయ్యా! అంటూ మీదపడుతున్నారు. మన మేడలో మేమి ద్దరమే వుండలేము. బావురు మంటూ వుంటుంది. యే వసతిలేని ఇంత చిన్న అద్దె యింట్లో వుండటమెందుకూ, మేడలో వుండాలి తక్కినవారి భాగాల కింద ధరకట్టి యిచ్చేస్తే మీకే అంతా చెం దుతుంది.

"ఆ మేడకి మంచి ధర పలుకుతున్నది బిజినెస్ పీపుల్ అడుగుతున్నారు మీకు వసతిగావున్న చిన్నయిల్లు కొనుక్కుని అందులో వుంటే మరుదులు, వదినెలు పిల్లలతో వచ్చి పోతూ వుంటారు, ఈ మేడకి రిపేర్సు, టాక్సుకింద చాలా అవుతుంది. అమ్మేస్తే చేతిలో డబ్బు మిగురుతుంది అంటుంది భాను.

"తెలివి గలదే" అనుకుంటాడు మామగారు.

శరశ్చంద్ర వుండుండి పరిధి దాటి, తాను మగవాడిని తనకు వెరుస్తూ లొంగి వుండాలని వాదిస్తాడు.

భానూ నవ్వుతూ అంటుంది, "నేను నా వాగ్దానం నిల బెట్టుకున్నానండీ. ప్రామిస్ చేయని పన్లు గూడా చేస్తున్నాను. లోబడి వుండక తిరగబడ్డానా? బ్లాక్ మెయిల్ చేశానా?"

శరశ్చంద్ర తగ్గుతాడు. నవ్వుతాడు.

"నీకు నేను దాసుడిని గాలేదూ?" అంటాడు.

"మోడరన్ దాసులండీ! విదేశాలు సింగిల్‌గా వెళ్ళి టూర్ చేసి వస్తూ వుంటారు. దానధర్మాలూ, హాబీలూ, అంతరాత్మ అన్నీ కాపాడుకుంటూ, మిగిలిన ప్రేమ ప్రవాహంలో నన్ను తానమాడమంటారు. మీ యిష్టం వచ్చినట్లు వుండేందుకు వీలుగా నా సాయం తెచ్చుకున్నారు. నాదీ అనే ప్రాణి వుండాలి. అందుకని నేనూ. ప్రేమ ప్రవాహంలో మీరొక్కరే యీద లేక పోయారు. నన్ను గూడా దింపారు" అంటుంది.

భానూ తల్లి వచ్చి మేనరికం కలుపుకోమంటుంది.

"అన్న కొడుక్కి నా పిల్లనిస్తే నాచేత చేయించినట్టే నా కూతురుచేతా వూపిరాడకుండా పని చేయించాలని మేనరికం అని అంటున్నావు. ధనవంతులమ్మాయి కట్నంతో వస్తుంది. ఆ డబ్బుతో పనివాళ్ళను పెట్టుకోమని వదినకు చెప్పు" అనేసింది నిర్మొహమాటంగా.

[] ○ []